# నాకు నచ్చిన నా కథ



అవసరాల రామకృష్ణారావు

గతం —

ఒరిస్సాలోని ఢెంకనాల్ గవర్నమెంటు కాలేజీలో ఆంగ్ల భాషా బోధన

ప్రస్తుతం —

ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నంలో రీసెర్చి స్కాలరుగా జార్జి ఆర్వెల్ మీద పరిశోధనా పరిపరివిధ సాధన.

అప్రస్తుతం —

నా ఊహల ఊపిరికి అందాల పందిరు అల్లిన తల్లిభాషలో కూడా ఎప్పటికైనా ఓ డాక్టరేటు కొల్లగొడదామనే దురాలోచన.

నా కథ గురించి

తప్పు ఏదైనా వివరించగలను. ఎంచి మీ ముందు ఉంచగలను గాని ఆ కథకీ మీకు మధ్య నిలబడి లెక్చర్లిచ్చే దారుణానికి ఒడిగట్టలేను కవిసమ్మేళనాలలో ఏ కవి కవితాపఠనానికి ఆఖరున ఆ కవి స్వయంగా ముందుగా చేసుకున్న చప్పట్ల ఏర్పాట్ల వన్నె ఇది హాస్యాస్పదం.

(అంతగా మీరు కాదూ కూడదంటే ఈ కథ 1982 యువ దీపావళి సంచికలో తొలిసారి వెలుగు చూసిందనే భోగట్టా మాత్రం ఇవ్వగలను)

— రచయిత.

# అందచందాల కథ

వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితులు. శక్తిగల వ్యక్తులను పూజించడంతో, చేతగానివాళ్ళను చీదరించుకోవడంతో మానవత్వమే నశిస్తున్న ఈ లోకంలో ఏ భేదమూ లేకుండా సమానంగా అన్ని విధాలా ఒకే త్రాటిమీద నడుస్తున్న నవయువకులు వాళ్ళు. ఒక తల్లి కడుపున పుట్టకపోయినా అన్నదమ్ములు వాళ్ళు. వాళ్ళకి 'నా' అన్నవాళ్ళు లేరని బాధ లేదు. ఒకరికొకరున్నారు, చాలు! కలసి జీవిస్తున్న కళాకారులు వాళ్ళు.

ఓసారి వాళ్ళిద్దరూ ఓ మ్యూజియంలో ఓ చక్కని శిల్పం చూశారు. ముసుగులోంచి సొగసు వెదజల్లుతున్న ఒక ముగ్ధ- చలువరాతి విగ్రహం అది. పండు వెన్నెలలో తాజమహలు అందం తనలో ప్రతిఫలిస్తే యమున మురిసి పరవళ్ళు తొక్కిందో లేదోగాని ఆ శిల్పంలోని చెక్కిన చక్కదనం చూచి వాళ్ళిద్దరూ మైమరచిపోయారు పంచేంద్రియాలకూ అతీతమైన భావమేదో వాళ్ళలో ఒక్కసారి ప్రజ్వలించింది. గచ్చుమీద ఉన్న గోతుల్లో నిలిచే నీళ్ళలో కిచకిచమంటూ పిట్టలు స్నానం చేసేటప్పుడు అయ్యే చప్పుడూ - కళ్ళు తెరవని పిల్లిపిల్ల మీసాలకు అంటుకున్న పాలచుక్కల్ని వాళ్ళమ్మ నాకి శుభ్రం చేస్తున్నప్పుడు అయ్యే చప్పుడూ - యిలాంటివేవో వింటున్నప్పుడు కలిగే ఆనందంలాంటి దేదో వాళ్ళలో నిలువెల్లా మెరిసి ఉండాలి.

'ఈ చేతలే చేతలు ఈ శిల్పం చెక్కిన చేతులే చేతులు' అనుకున్నారు వాళ్ళు. ఇద్దరికీ ఒకేసారి శిల్పకళ అభ్యసించాలని బుద్ధి పుట్టింది. ఆ పట్నంలో ఆ విద్య నేర్పే ఓ ప్రైవేటు కాలేజీకి వెళ్ళి అడిగారు. ఆ కాలేజీలో ఆరునెలల పాటు శిక్షణనిచ్చి పరీక్షకు తయారుచేస్తారు. నెలకి ఏభై రూపాయిలు ఫీజు తీసుకుంటారు.

వాళ్ళిద్దరూ బాగా బీదవాళ్ళు. వాళ్ళకున్న కొద్ది ఆస్తీ తినడానికే బొటాబొటీ అవుతూండేది. ఫీజు కూడా ఎక్కణ్ణుంచి తెచ్చి కడతారు? అల్లంత దూరాన ఆశ బాధించగా నాలుగురోజులు కిందా మీదా పడ్డారు. రోజూ రెండున్నర రూపాయలు కూలి యిచ్చే ఫ్యాక్టరీ ఒకటుందని తెలుసుకున్నారు ఆ వూళ్ళోనే

'నే నివాళే ఫ్యాక్టరీలో చేరుతాను. ఆ డబ్బుతో నువ్వు నేర్చుకో. ఆర్నెల్లు నువ్వు అక్కడ నేర్చుకోవడం అయాక యిక్కడ పనిచేద్దువుగాని-

అప్పుడు నేను నేర్పుంటాను' అన్నాడు అందులో పెద్దవాడు. అలాగే అన్నాడు చిన్నవాడు. పెద్దవాడు ఫ్యాక్టరీలో కూలిపనిలోనూ, చిన్నవాడు శిల్పకళా శిక్షణ కేంద్రంలోనూ చేరారు. పెద్దవాడు డబ్బు తెచ్చి చిన్నవాడికి జీతం కట్టేవాడు. చిన్నవాడు శిల్పకళ అభ్యసించేవాడు. అరమరిక అన్నది లేకుండా అలా ఆరునెలలు గడిచాయి.

'ఒరే రాముడూ నా సరదా కొంతవరకు తీరింది. ఇవాళ్నుంచి నేను ఫ్యాక్టరీకి వెళతాను' అన్నాడు చిన్నవాడు.

ఎంతో ఉత్సాహంతో, ఆశతో పెద్దవాడు కాలేజీకి వెళ్ళేడు. వెళ్ళినట్టే తిరిగివచ్చాడు. ఆ కళ్ళలో జీవం లేదు! రాగానే తమ్ముణ్ణి కౌగలించుకుని హృదయ విదారకంగా ఏడ్చాడు. వాడి ఆశ నిరాశ అయింది. గొడ్డళ్ళూ, గునపాలూ ఎత్తి, కాయలు కాచి బండబారిపోయి, సున్నితత్వం శూన్యమయిన వాడి చేతుల కిక శాశ్వతంగా కళాభ్యాసంచేసే అదృష్టం లేదు. చేతులే వాడి హృదయమే బండబారిపోయింది. కొంతసేపటికి అందులోంచే ఓ పచ్చని మొక్క తొంగిచూసింది. 'ఏమిటో ఎంతసేపూ నా గురించే ఆలోచించాను గాని .... నిజానికి... నేనే అదృష్టవంతుణ్ణిరా కిష్టుడూ.... నే నేమైపోతే ఏంగాక నీలాంటి మహాశిల్పిని తయారుచేశాను.... మొదట నేనే కాలేజీలో చేరి నువ్వే ఫ్యాక్టరీలో చేరేవ్ కాదు, యింకా నయం!' పెద్దవాడు చిన్నవాడి సుందరమైన వ్రేళ్ళని ప్రేమతో స్పృశించాడు. చిన్నవాడు భరించిన బాధ భాష్యాని కందనిది అనుభవించిన ఆవేదన అక్షరాలకు అంతుపట్టనిది.

పెద్దవాడి రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకున్నాడు. ముద్దెట్టుకున్నాడు. కళ్ళ కద్దుకున్నాడు. కన్నీటితో అభిషేకం చేశాడు.

'ఎంత మంచివి ఈ చేతులు! ఎంత అందమైనవి ఈ చేతులు! తాము త్యాగంచేసి అరిగిపోయి నా చేతుల్లోని సౌకుమార్యాన్ని నిలిపి సుందరమైన కళను వికసింపజేసిన వీటికి నేను చెయ్యగల బహూకృతి ఏమిటి? ఏమిటి?'

ఆ చిన్నవాడు అదేపనిగా ఆలోచించాడు. వాడి మనస్సులో శ్రమ సౌందర్యంతో జ్వలిస్తున్న ఆ చేతులూ వ్రేళ్ళూ అలా నిలిచిపోయాయి కరుణా రసం కరడుగట్టి కళ్ళెదుట నిలిచింది. సర్వశక్తులూ కేంద్రీకరింపజేసి వాడి జీవితంలో ఒకే ఒకసారిగా అద్భుతమైన శిల్పకళాసృష్టి చేశాడు. ఆ రెండు చేతుల్నీ ఒకదాని ప్రక్క మరొకటి ప్రార్థిస్తున్నట్టు చక్కని ఫలకంపై

అపూర్వంగా చెక్కాడు. 'చేతులారంగ....' అని క్రింద వ్రాశాడు. ఆ శిల్పానికి ప్రపంచంలోనే ప్రథమ బహుమతి లభించింది.

* * * *

అందచందాల నిర్వచనంగా ఒకరు ఓ చోట చెప్పిన చక్కని కథ పైది. అదే సంగతి నాకు మరో విధంగా బోధపడిన మరో చిత్రమైన కథ క్రిందిది.

* * * *

కృష్ణమూర్తి నాకు యింటర్మీడియట్‌లో క్లాసుమేటు. తుని నుంచి నేనూ, ద్రోణాచలం నుంచి వాడూ వచ్చి కాకినాడలో కలుసుకున్నాం. కలుసుకున్న కొద్దిరోజుల్లోనే పైకి తెలియని పరస్పరాకర్షణకు లోనయ్యాం గాఢ స్నేహితులం అయిపోయాం.

ఇప్పుడు తలుచుకుంటే ఆ రోజుల్లో అతని చమత్కార సంభాషణకే జోహారు లర్పించనా అనిపిస్తుంది.

'కృష్ణమూర్తీ యీ చొక్కాగుడ్డ చాలా బాగుందయ్యా. ఎక్కడ తీశావు?'

'కొట్లో.'

'ఆ సంగతి అందరికీ తెలుసు.... ఎక్కడ కొన్నావని?'

'బజార్లో.... బట్టల కొట్లో.'

'అబ్బ.... ఏం భాష బాబూ యిది?'

'తెలుగు.'

'అలాగా, మాకు తెలీనప్పుడు... గుడ్డ ఆకర్షణీయంగా ఉండబట్టి ఇన్నిన్ని రకాల ప్రశ్నలు అడగవలసి వచ్చింది. ఏ కొట్లో కొన్నావో చెప్పవు గదూ.... పోనీ కొట్టుకొట్టూ వెతుకుతాంలే, ఎలా కొన్నావో అయినా చెప్పు మరి.'

'డబ్బిచ్చి.'


'ఏం తిక్కమనిషి బాబూ? సరిగా చెబుతావా చెప్పవా? గజం ఎంత?'

'మూడడుగులు.'

'అబ్బా చంపకయ్యా బాబూ. అసలే మేము గుడ్డ దొరకదేమో అని సస్పెన్సుతో చస్తుంటే.... బట్ట ఎలా తీశావని?'

'ఇలా.... కుడిచేత్తో.'

అంతేగాని అడిగినదానికి ఆ మనిషి నుంచి జవాబు రాదు!




ఓసారి మా క్లాసులో- మేం ఎప్పుడూ చివరి బెంచీలో కూచునేవాళ్ళం- విష్ణుచక్రవాదం కోసం గజేంద్రుడిలాగ- బెల్ ఎప్పుడవుతుందా అని చూస్తూ కూచున్నాం. కఠిన సమాస భూయిష్టమైన వ్యాకరణారణ్యంలో అగోచర విహారం చేస్తున్నాడు మా తెలుగు లెక్చరరు ...మేశ్వరరావుగారు. ఒకళ్ళకి ఒక్క ముక్క బోధపడితే ఒట్టు. కృష్ణమూర్తి నా ముందుకి చిన్న కాగితం విసిరాడు. అందులో యిలా రాశాడా తుంటరి.

'నవనవలాడెడు ప్రాణులు
చివరికి తమ బోధచే అచేతనులయ్యేన్
భవదీయ శిష్యకోటికి
శివశామా! క్లాసు వదిలి జీవనమిమ్మా!'

నా వెనకవాళ్ళూ పక్కవాళ్ళూ - గేలరీమీద ఉన్నామేమో - ఓ పదిమందిలా ఆ కాగితం చదువుకుని ఒక్కసారి గొల్లుమన్నాం.

'ఆ కాగితం యిలా యివ్వండి' అన్నారు ఆయన. మాకు ప్రాణాలు లేవు.

ఆవేళతో మా కృష్ణమూర్తి కాలేజీ జీవితం సరి అనుకున్నాను ఆ రోజు. ఆయన ఎంత సరసుడో చూడండి. పద్యం చాలా బాగుందనీ యింకా రాస్తూండమనీ ప్రోత్సహించి పంపేడు!

చపలత్వమూ చుఱుకుతనమూ చిత్రంగా మేళవించిన వాడి బహు విధ మైన 'యాక్టివిటీ' చూసి వాడికి నేను 'ఉదతశ్రీ' అని మారుపేరు పెట్టేను. అయితే వాడు వాడు తిరిగి బహూకరించిన మారుపేరు యిక్కడ నేను చెప్పడం ప్రస్తుతమూ కాదు – నా కేమంత క్షేమకరమూ కాదు.

అయితే తూగుటుయ్యాల లూగుతున్న ఈ గంగాతరంగాలకు గంగోత్రి వేరే ఉందని నాకు ముందు తెలియనేలేదు.

హెచ్. యీ. ఏ. డి. కలిపితే 'హెడ్' అని పలికే వాడు 'రన్ గ్రామరు' అవసరమని ఇరవై యో ఏట తోచి కృష్ణమూర్తి నడుగుతే అలాగే అని తెచ్చి పడేశాడు.

ఇస్తూ ఓ పజిలు నామీద విసిరాడు.

'ఇది మా అమ్మది. అంతేకాదు ఈ పుస్తకమే నాకు అమ్మలాంటిది.... ఒక్క పేజీ నలిగిందా డొక్క చీల్చేస్తాను.'

ఈ పైత్యానికేంలే.... అని మనసులో అనుకుని ఆ పుస్తకం యిలా తీశాను.

ఆ పేజీపైనున్న ఖాళీలో యిలా ఉంది.

'నా పేరు తెలుసుకోవాలనుందా?.... రెండొందల ఏభైనాలుగో పేజీ చూడు.'

ఆ పేజీ తీశాను.

'అంత సులువుగా దొరుకుతానా? నూటపదో పేజీ తిరగెయ్యి.' అదీ తీశాను.

'ఇక్కడ కాదు. అరవైనాలుగో పేజీ చూడు.' అది కూడా తీశాను.

'ట్రై అండ్ ట్రై. నూటఏభై రెండులో వెతుకు. సహనం ప్రయోజనకారి కాకపోదు.' నాకు ప్రాణం విసుగెత్తినా తహతహ చంపుకోలేక ఆ పుటకూడా తీశాను.

'దారిలోనే ఉన్నావులే.... మంచివాడవు కదూ? ముప్పైమూడో పేజీ తియ్యమ్మా.' ఆ పేజీ కూడా తీశాను.

'ఓయి వెర్రివాడా? ఎందమావుల్లో ఏపీ బావులు? పేరు ఎక్కడ రాసుకుంటారో ఆ మాత్రం తెలియదా నీకు?'

ఇంతా వెదికితే చివరికి మిగిలింది ప్రశ్న మాత్రమే. కొంచెం ఆలోచించి మొదటిపేజీ చూశాను. కాస్త కనీకనబడకుండా అక్కడే ఉన్నాయి అక్షరాలు

కే. స్వరాజ్యలక్ష్మి అని. గ్రామరు నాకు రాలేదుగాని అందులో గ్లామరు నన్ను ముగ్ధుణ్ణి చేసింది. పెళ్ళిచూపులనాడు కూడా 'మా అమ్మాయి ముస్తాబు అవుతోంది. అందాకా దాని రైటింగు ఎలా ఉంటుందో చిత్తగించండి' అని కృష్ణమూర్తి తండ్రికి యీ పుస్తకమే అందించారట. అందులోని కొంటెతనాన్ని గాఢంగా వరించి అనాడే బాలగంగాధరతిలక్‌తోపాటు గంగాధరంగారు కూడా 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనుకున్నారుట!

* * * *

రాజ్యలక్ష్మమ్మగారికి కాపురానికి వచ్చిన మరుచటి ఏడే కృష్ణమూర్తి పుట్టేడుట. ఆ పురిట్లోనే ఆవిడకు చాలా జబ్బుచేసిందట. దానితరవాత మళ్ళీ ఆవిడకి కానుపులేదు. ఇది ఎందుకు చెపుతున్నానంటే వాళ్ళిద్దర్నీ తల్లీ కొడుకులని ఎవరూ అనుకోరు. వీడు ఉడతలా ఉంటే ఆవిడ పిచికలా ఉంటుంది. ఇద్దరూ అక్కా తమ్ముళ్ళలా ఉండేవాడు. ప్రతీ చిన్న విషయానికి యిద్దరూ చిన్న పిల్లల్లా దెబ్బలాడుకుంటూ ఉండేవారు ఎడ్వొకేటు గంగధరంగారికి యిది రెండూ రెడుకళ్ళు. ఎవరిపక్షం తీర్పుచెప్పకుండా రవ్వంత విసుగులేకుండా చిరునవ్వుతో ఆయన వాళ్ళ చిల్లర తగవుల్ని వీక్షించటం నాకు ఎప్పటికి కమనీయ దృశ్యం.

'ఈ వెర్రివెధవకి చదువొకటా? పెళ్ళి కూడానా ఖర్మ!' అనే ఆ తల్లి కొడుకు చీకటిపడేసరికి యింటికి రాకపోతే కలిగే ఆత్రుతా, 'ఇంత వయసొచ్చి దీనికి పౌడర్లు ఎందుకో? ఈ షికార్లు ఏమిటో' నే ఆ కొడుక్కీ తల్లికి కాస్త ఒళ్ళు వెచ్చగా ఉంటే ఖొందే అదుర్దా మానసికాల ఎరి, చెబితే నమ్మరు గద!

* * * *

మా స్నేహానికే అప్పటికి ఎనిమిదేళ్ళ వయసొచ్చింది.

వాడి పెళ్ళికి నే వెళ్ళినవాడు అంతమందిలోనూ పెళ్ళాన్ని దరబరా నా ముందుకి లాక్కొచ్చి....

'ఎలా ఉందటావ్? నిజం చెప్పు కనురెప్పలు దిద్ది. సవరం జెడ పెట్టి మోసపుచ్చారు పెళ్ళిచూపులనాడు ... ఇంత చిన్న కళ్ళు అనీ, ఇంత చిన్న జడ అనీ ఎవరికి తెలుసు!' అనడం, వెంటనే ఆ పిల్ల అందుకుని 'నిజమే నిజమే.... అరంగుళం దళసరిని కోటాకొట్టి, పక్కనున్న కుర్చీపీటమీద నిలబెట్టి బోల్తా కొట్టించారు ఆనాడు. ఇంత నల్లరంగు అనీ మరీ యింత పొట్టిమనిషి అనీ ఎవరికి తెలుసు!' అనడం నేను మరిచిపోలేని విషయాలు. అంతేగాదు. కృష్ణమూర్తి కొడుకు అన్నప్రాశననాడే వాళ్ళు క్రొత్తగా కట్టించుకున్న యింట్లో గృహ

ప్రవేశం కూడా చేశాను. ఆంధ్రదేశంలో ఉన్న అయిదురకాల సంపెంగలూ, మాదీ అని ఓ యిల్లు కట్టుకుని అందులో వేసుకోవాలి అనే గంగాధరంగారి కోరిక కూడా తీరింది. నేను వాళ్ళ కొత్తయింటికి రాగానే మొక్కలకి నీళ్లు పోస్తూ చిన్న చిరునవ్వుతో పలకరించింది కూడా ఆయనే.

'అదేమిటి మీరు నీళ్ళుపోస్తున్నారేం? బంట్రోతు ఏమయాడు?'


'మానిపించేశాను. ఇంకా వాడెందుకు? అయినా ప్రాక్టీసు కూడా మానేశాక నేను యింట్లో ఉండి పడే పాటేమిటి గనుక? వాడేమో ఆఫీసుకు పోతాడు. కోడలు ఎప్పుడూ అలా పెరట్లో పనిచేసుకుంటూనే ఉంటుంది. ఇంకా మా ఆవిడ సంగతి నీకు తెలిసిందే కదా . ఎంత వయసొచ్చినా యింట్లో క్షణం కాలునిలవని వెయ్యికళ్ళ పూజారి అది . ఇంక యీ కోటలో మిగిలేది యింకా పళ్ళూడని యీ తాతగారూ, యింకా పూర్తిగా పళ్ళురాని ఆ బాబుగారూ ఎవరికి తప్పినా మాకు మాత్రం తప్పదు గదా '

ఆ చివరి మాటలు ఆయన నవ్వుతూ అన్నప్పుడు ఆయనగాని నేనుగాని అలాగే జరుగుతే ఏలా ఉండునని కలలో అయినా అనుకోడానికి అంగీకరించి ఉండము. కాని జరిగింది అదే ఆ మధ్య ఆ వూళ్లో ఇన్‌ఫ్లూయెంజా అంటువ్యాధి మహాతుఫాను ఇంటింటా వచ్చి వెలిసిన తరువాత ఆ యింట్లో ఆ తల్లీ లేదు, ఆ కొడుకూ లేడు!

'ఇదిగోనోయ్ . ఇదే డ్రాయింగు రూం. ఇది మా అబ్బాయి బెడ్ రూం తరువాత వసారా, అది దాటితే హాలూ ... దూరంగా మా పడకగదీ.... ఎందుకంటావా చిన్నగాక మొన్న పెళ్ళయినవాళ్ళు వాళ్లు.... ఏం ముద్దులూ ముచ్చట్లూ ఉంటాయో .. ఆ గుసగుసలూ అవీ రాత్రిపూట యింకోళ్ళు వినడం వాళ్ళకి ఏమంత హితవుగా ఉంటుంది గనక . అందుకని మా గది దూరంగా. .'

'అలా అనకపోతే మీ తస్సుబుస్సలూ, చిర్రుబుర్రలూ వినిపించకుండా మీ గదికి మా గదే దూరంగా ఏర్పాటు చేశారని ఎందుకనుకోకూడదు?' అని పరాచికాలాడుకొనే ఆ తల్లీ కొడుకూ యిప్పుడు లేరు!

విద్యాపీఠం వదలి పొట్ట చేత్తో పట్టుకొని ఎవరి సంసార తాపత్రయాల్లో వాళ్ళు పడిపోయి విడిపోయినా, నాకే 'కృష్ణమూర్తీ, మమ్మల్నందర్నీ విడిచి వెళ్ళిపోయావా కృష్ణమూర్తీ!' అని గుండె బద్దలవుతూంటే— ఆ కఠిన సత్యం ఒప్పుకోడానికి మనసు శతథా మొండికెత్తుతూఉంటే— ఆ గంగాధరంగారికి




ఒక్కగానొక్క కొడుకు.... పాతికేళ్ళవాడు . ఉద్యోగం చేస్తున్నవాడు.... కట్టుకున్న యింట్లో కళ్ళముందు కలకాలం కళ ల్లాడుతూ కదలాడవలసిన వాడు... హఠాత్తుగా మాయమయితే ఎలా భరించారో బాధ పంచుకోడానికి సహధర్మచారిణి కూడా లేకుండా కొడుకుతో గిల్లికయ్యం పెట్టుకోడానికి కూడా వెళ్ళిపోతే, ఎలా బతికి బయటపడ్డారో నా ఊహకి విషయం ఏదో పనిమీద ఆ ఊరు వెళ్ళినా అటువైపు వెళ్ళడానికి నా కాళ్ళు రాలేదు. అయినా ఆ వీధి చివర్నే మా బంధువులు ఉంటే వెళ్ళవలసి వచ్చింది. ఆయనే నన్ను చూసి పిలిచారు. ఆయన్ని చూడగానే నా కళ్ళనీళ్ళు ఆగలేదు

'నన్ను పరామర్శించడానికి వచ్చి నువ్వే ఏడుస్తున్నావా బాబూ!' అన్నారు ఆయన. నేను కళ్ళొత్తి చూశాను

'ఏమిటో ప్రతి శరీరమూ ఒక అద్దెకొంప. కాని ఈ అద్దెకొంపే ప్రతినిత్యం సొంతకొంప కోసం చూస్తూంటుంది. చిత్రంగా లేదూ?'

నిజమే. ఆయన మాట చిత్రంగానే ఉంది చెట్టంత భార్యనీ, కొండంత కొడుకునీ మింగి ఇంకా ఆ మొహంలో ఆ చిరునవ్వు కాంతి చెదరకపోవడం చిత్రంగానే ఉంది.

'మానవుడు స్వార్థపరుడు బాబూ.... స్వార్థంతోనే మనోస్వాస్థ్యంకూడా చెడుతుంది. కొడుకును పోగొట్టుకున్నాననే స్వార్థమే నా కన్ను కప్పేసింది.

నే నింక బతుకుతే ఎన్నాళ్ళు బతుకుతాను గనుక? ఆ పిల్ల, ఎవరు, మా కోడలి మాటే చూడు. ఆ పిల్లకి పద్దెనిమిదేళ్ళు కూడా వెళ్ళలేదు, దాని బతుకు ఏం కావాలి చెప్పు? దాని దుఃఖం ముందు నా దుఃఖం ఏపాటిది చెప్పు? మృదువైన మనస్సూ, చురుకైన బుద్ధీ, పదునైన నాలికా కలిగి నిత్యం చైతన్యస్రవంతితో యిల్లు ప్రవహింపజేసే భార్యా, కొడుకూ ఒకేసారి పోయిన మహాదారుణమైన దుఃఖంలో కూడా యీ 'నయనపథగామి' ఎదటవారి కష్టసుఖాల గురించే ఆలోచిస్తున్నాడు! ఈ సుఖదుఃఖాలకు వీళ్లెందుకు వంతులుకారో యిప్పుడిప్పుడు కొంతవరకు నా కర్థమౌతోంది.

'అవునవును పాపం.... కృష్ణమూర్తి పెళ్లాం ... ఇప్పుడెక్కడుంది?'

'ఎక్కడుంటుంది? వీడెక్కడున్నాడో అక్కడ ..'

నే నంతసేపూ చూడనేలేదు. తాతగారి వెనకనుంచి వాడివతలకి వచ్చాడు. రెండేళ్ళయింది వాణ్ణి చూసి. బాగా ఎదిగాడు. ఎంతో ముద్దొస్తున్నాడు.

'ఏం చదువుతున్నావు?' అన్నాను యింకేం మాటాడాలో తెలీక.

'పిపరీతిరీ' అన్నాడు. నాకేం బోధపడలేదు. గంగాధరంగారు చెప్పేరు ఏదో మిషన్ స్కూల్లో 'ప్రిపరేటరీ' సెక్షన్లో ఉన్నాట్ట.

శలవు తీసుకుని వెళ్ళిపోతూ వెనక్కితిరిగి చూశాను. అన్ని గదులూ బావురుమంటూ భయం భయంగా కనిపించాయి. అంత ఇంట్లో వెనక పెరట్లో ఆ పిల్ల ఒక్కర్తీ ఏం పని చేసుకుంటూందో భగవంతుడికి తెలియాలి. ఆయన ఏదో మొక్కకి గొప్పు తవ్వుతూంటే మనవుడు వీపుమీద ఎక్కి ఊగుతున్నాడు. వాళ్ళమీద చెప్పలేని అభిమానం కలిగింది. 'ఎవరికి తప్పినా మాకు మాత్రం తప్పదు గదా!' అన్నట్టున్నారు వాళ్ళు.

* * * *

ఇంకో రెండేళ్లు గడిచాక భగవంతుడు గంగాధరంగారిని మరోసారి పరీక్షించాడు. అది ఇలా జరిగింది అనుకుంటాను.

రానురాను గంగాధరంగారికి గార్డెనింగ్ పిచ్చి మరీ ఎక్కువైపోయింది. ఆయన యింట్లో పూయించని పువ్వు లేదు. సాయంకాలం అయేసరికి పువ్వులన్నీ కోసి ఆయనే స్వయంగా అరటినారతో మాలలు కట్టేవారు. ఆ దండలన్నీ మనవడిచేత ఆ చుట్టుప్రక్కల యిళ్ళన్నిటికీ పంపేవారు. అదే పూజ అని ఆయన ఉద్దేశం. కళ్లెత్తి చూస్తే ఒకొక్కప్పుడు అరుగుమీద నిలబడి రెండు

కళ్ళల్లోనూ నీటిముక్కలు కారుతున్న ఆ కోడలిలో ఆయనకి తెగిపోయిన పూలమాలిక కనిపిస్తూ ఉండేది.

'వెర్రితల్లి .. నీ తలలో దండ పెట్టే అదృష్టం నాకు లేకపోయింది' అనేవాడు.

'అక్కర్లేదు .. మీలాంటివారే నాకు ప్రత్యక్షదైవం . నా కన్నీటి పుష్పాలే మీకు ఈ దీనురాలి పూజ' అనుకునేది ఆమె ..

పువ్వులే కాదు, ఆ ఇంటి ముందున్న విశాలమైన స్థలంలో చక్కని ఆకుపచ్చని లాన్ పెంచడం ఆయనకు మహా ఇష్టంగా ఉండేది. 'ఇవి గరికపచ్చలు కావు.... భూమహాలక్ష్మి ధరించే గరుడపచ్చల పతకాలివి' అనుకునేవాడు ఆయన ..

'తాతా తప్పో తప్పో' అంటూ మూడుచక్రాల సైకిలుమీద వచ్చేవాడు మనవడు, తాత పరచిన పచ్చతివాసీ తొక్కుకుంటూ.

ఆ దృశ్యం చూసి కళ్ళకద్దుకునేది ఆ యింటికోడలు. ఓ సారి వాళ్ళకు తెలిసినవాళ్ళ పిల్లలెవరో చిన్న రెయిన్‌కోటు వేసుకుని వెళుతూండడం ఆ బాబు చూశాడు. అలాంటిది కావాలని పేచీ పెట్టాడు వాడు కోరితే తీరని కోరిక అంటూ ఏముంటుంది ఆ యింట్లో? మరుక్షణం వాడికి సరిగ్గా సరిపోయే సిమెంటు రంగు చిన్న ప్లాస్టిక్ రెయిన్‌కోటూ, చక్కని పువ్వుపువ్వుల రెయిన్‌హేటూ యింట్లో ప్రత్యక్షమయ్యాయి.

తేగానే అవి వెంటనే వేసుకున్నాడు ఆ బాబు

'వెంటనే వెళ్ళి మా స్కూల్లో పిల్లలందరికీ చూపిస్తా' అన్నాడు వాడు.

'వర్షం రాందే అవి వేసుకోకూడదు బాబూ. అందరూ నవ్వుతారు.'

బాబు చిన్నబుచ్చుకుని అవి విప్పేశాడు.

'అమ్మా! అమ్మా వర్షం ఎప్పుడొస్తుందే?' అని తల్లి గడ్డంపట్టుకు అడిగాడు.

'వచ్చినప్పుడు చెబుతాలే, అప్పుడు ఎంచక్కా వేసుకుందువుగాన్లే' అంది ఆవిడ. కాని నిజంగా చెప్పనేలేదు. ఆ రాత్రి వర్షం కురిసి కిటికీలోంచి జల్లొచ్చి లోపల పడుతూంటే తలుపు వేసేసి పడుకుంది.

'అమ్మా రాత్రి వర్షం వచ్చిందా?' అని లేస్తూనే అడిగాడు బాబు గుంటల్లో నిలబడ్డ నీటిని చూసి.

'అవును బాబూ!'

'మరి నాతో చెప్తానన్నావ్‌గా. లేపలేదేం?'

'ఆ అర్ధరాత్రివేళ ఏంచేస్తానురా'

'మరి వానొస్తే రెయిన్‌కోటు వేసుకోవద్దా' ఆవిడ నవ్వింది.

'బాగానే ఉందిరా నీ వరస.. వస్తే వేసుకోవాలిగాని ఊరికే ఎందుకూ?'

'వేసుకుని తిరగకూడదా ఏమి?'

బాబు అమ్మని క్షమించలేదు. పోనీ అది వేసుకుని పదిమందికీ చూపించక పోతే పోయె ఓసారి అది వేసుకుని వానలో నుంచుంటే ఎంత తమాషాగా ఉంటుంది?

వర్షకాలమయినా నాలుగు రోజులూ వర్షమే కురవలేదు. అయిదోరోజు వర్షం కురిసే వేళకు బాబు బళ్ళో ఉన్నాడు. వాడు ఆవాళ స్కూలుకి రెయిన్ కోటు తెచ్చుకోలేదు. స్కూలు విడిచేసరికి వాన వెలిసిపోయిందికూడా....

బాబు ఆశగా ఆకాశంకేసి చూసేవాడు ఎక్కడయినా చిన్న మబ్బు అన్నా ఉన్నదేమోనని.


'తాతా అసలు యింక వానలన్నావి పడవా?' అని అడిగాడు ఆ రోజున గంగాధరంగారిని. ఆయన వాడి కళ్ళలోకి చూశారు. అక్కడ లేదా వాన? పెద్దపెద్ద చినుకులు పడాలి, పన్నీరులాంటివి, పారిజాతాల లాంటివి, బిగబిగబిగబిగ పోవాలి ... పడదా పడాలి విప్పుటవిప్పుటమని పడాలి. నిలువుగా అడ్డంగా వంకరగా అన్ని రకాలుగా చినుకులు పడాలి. అమ్మోయ్, నాన్నోయ్, బాబోయ్, తాతోయ్ అని అందరూ అటు యిటూ పరిగెత్తాలి. ఆ మధ్యనుంచి ఏ మాత్రం భయంలేకుండా ఏ కొంచెం బెదురు లేకుండా కవచం తొడుక్కుని యుద్ధంలోకి వెళ్ళిన అభిమన్యుడిలా తను రెయిన్‌కోటు వేసుకుని, టోపీ పెట్టుకుని నడుచుకుని నడిచివెళ్ళాలి అందరూ ఆశ్చర్యపోవాలి

అన్ని కోరికలున్నాయి ఆ కళ్ళల్లో.. అన్ని రంగులున్నాయి ఆ కన్నీళ్ళలో.

ఆ మర్నాడు పదిగంటలవేళ బాబు పరిగెత్తుకు తాతదగ్గరకి వచ్చాడు. ఒక మోస్తరుగా వర్షంపడుతోంది.

'తాతా, తాతా యిదిగో రెయిన్‌కోటు తొడగవూ? నాకు పెట్టుకోడం రాదు తాతా, గుండీలూ అవీ సరిగా పెట్టవూ?'

వాడి సరదాకి ముచ్చటపడి గంగాధరంగారు కోటు తొడుగుతూ ఒళ్ళు




ముట్టుకు చూశాను యధాలాపంగా. ఒళ్ళు కాలుతోంది. ఐదు గుండీలు పెట్టిన కోటును మళ్ళీ విప్పేశాను. ఎత్తుకుని కోడలి దగ్గరికి తీసుకొచ్చేను.

'వీడికి జ్వరమొచ్చినట్టుంది చూడు తల్లీ' అన్నాను భయంగా. టెంపరేచరు చూశాం. నూటరెండు ఉంది.

వాడు ఆ కోటు వేసుకుని వర్షంలోకి వెడతానని ఎంత పేచీ పెట్టినా వాళ్ళు ఒప్పుకోలేదు. ఆవాళ ప్రారంభించిన ఆ వాన ముసురుగా పట్టి యించుమించు వారం రోజులు కురిసింది. కిటికీలోంచి వర్షం చూస్తున్నాడు వాడు. హేంగర్‌కి తగిలించి గాలికెగురుతున్న రెయిన్ కోటు చూస్తున్నాడు వాడు. అలా ఆ వారం రోజులు చూస్తూనే ఉన్నాడు. చివరిరోజున పన్నీటిలాంటి, పారిజాతాల్లాంటి, బాణాల్లాంటి ఆ చినుకులు ఎక్కణ్ణుంచి వస్తాయో అక్కడికే వెళ్ళిపోయాడు వాడు!

* * * *

కృష్ణమూర్తి కొడుకు పోయాడన్న సంగతి వినగానే మ్రాన్పడిపోయాను నేను. పిచ్చెత్తకముందో, ఆత్మహత్య చేసుకోకముందో తక్షణం వెళ్ళి గంగాధరంగారిని కలుసుకోడం నా కర్తవ్యంగా భావించాను. ప్రకృతిలో లీనమై పరమపవిత్రంగా జీవితాన్ని గడుపుతున్న ఆ ప్రశాంతమూర్తిని యింకా భగవంతు డెందుకు పరీక్షిస్తున్నాడో నాకు తెలీదు. దేన్ని చూసుకుని బతుకుతున్నాడో అదే పోతే మనుషులు ఏమైపోతారో నాకు తెలీదు. తెలుసుకోవాలని ఉంది. అందుకే తక్షణం రెక్కలు గట్టుకుని అక్కడ వాలేను.

గేట్లోంచే అల్లంత దూరాన గంగాధరంగారిని చూస్తూ నిర్ఘాంతపోయాను.

ఈసారి కూడా నన్నే ఆయన పరామర్శ చేయవలసి వస్తుందని నేను కలలో అనుకోలేదు ఆయన చేతికర్రతో కొమ్మలు విరిగిపోకుండా గులాబి పువ్వులు కోస్తున్నాడు. 'రా, బాబూ రా గుమ్మంలోనే నిలబడిపోయావేం?' అని ఎప్పట్లా ఆదరించాడు. స్పష్టంగా. శ్రద్ధగా విన్నాను, చూశాను. అదే గొంతుక, అదే చిరునవ్వు. అది మానవ హృదయమో కఠిన శిలాఫలకమో నాకు అర్థం కాలేదు నిశ్శబ్దమైన వాతావరణాన్ని, నిర్మానుష్యమైన ఆ భవనాన్ని నేను భరించలేకపోయాననుకుంటాను. కాదు . కాదు... అత్యున్నతమైన ఆ మహా వ్యక్తి సాన్నిధ్యాన్ని నేను సహించలేకపోయాను. ఆతడు చెప్పి చూసుకుని జీవిస్తున్నాడో నేను ఊహించలేకపోయాను. 'ఎవరికి తప్పినా నాకు మాత్రం తప్పదు గదా!' అని ఎలా అనుకోగలుగుతున్నాడో అర్థంచేసుకోలేకపోయాను 'మళ్ళీ వస్తాను' అని గుమ్మంలోంచే వచ్చేశాను.

దుర్భరమైన ఏకపుత్ర శోకంతో మునిగిపోయిన కృష్ణమూర్తి భార్యని తీసుకువెళ్ళడానికి వచ్చిన ఆమె తండ్రి రెండు చేతులూ పట్టుకుని 'బావగారూ.. దురదృష్టవంతుణ్ణి నేను. మనిషిని మీ దగ్గిరున్నా బతుకునేమో.... అమ్మాయిని చూస్తే కడుపు తరుక్కుపోతోంది. బొత్తిగా చిన్నపిల్ల.. పెళ్ళి కాలేదనుకోండి పిల్లే పుట్టలేదనుకోండి . తగిన ధైర్యంచెప్పి నాలుగు మాటలు చెప్పి మళ్ళీ మనిషిని చెయ్యండి ఈ అయిదువందలూ ఉంచండి.... పిల్లని అలాగే ఉంచెస్తే దగ... మన్ని క్షమించడు. వీలయినంత తొందర్లో పెళ్ళి చేసేద్దాం ఎంత కష్టం యిచ్చినాసరే. ప్రపంచమంతా ఎదురైనా సరే' అని గంగాధరంగారు అన్నారంటే కొంతవరకు నమ్మగలను.

ఎనిమిదేళ్ళ శంకరాచార్యుడు 'అదేమిటి అమ్మా, తెలిసినవాళ్ళెవరో పోయారని ఏడుస్తున్నావా? తొమ్మిది కన్నాలున్న తోలుతిత్తి అయిన ఈ శరీరంలో ప్రాణవాయువులాంటి పదార్థం ఉండటమే చిత్రంగాని-అది బయటకు పోయిందంటే అందులో ఆశ్చర్యం ఏముంది?' అన్నాడంటే కథగా నేను నమ్మగలను. అదే ఆధ్యాత్మిక దేశంలో అన్నీపోయిన గంగాధరం లాంటివారు చిరునవ్వుతో జీవించగలుగుతున్నారన్న విషయం సత్యమే అయినా అది నాలాంటి సామాన్యుడికి అర్థంచేసుకోలేనిది. గంగాధరంగారి ఆత్మ అందచందాలు నాలాంటి వాడికి అగోచరమైనవి.